నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4 PM




## రంజాన్ మాసంలో ఖర్జూరాన్ని ఎందుకు తింటారు?



రంజాన్ మాసంలో ఖర్జూరానికి డిమాండ్ మరింత పెరుగుతుంది. ఎందుకంటే ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనిలో కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇది మన శరీరానికి శక్తిని ఇవ్వడమే కాకుండా.. ఉపవాసం ఉండే వారికి తగిన బలాన్ని అందిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. అందుకే రంజాన్ మాసంలో ఉపవాసం ఉండేవారు ఖర్జూరాన్ని తినేందుకు ఆసక్తి చూపిస్తారు.

## 21% సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ నో టిక్కెట్

సార్వత్రిక ఎన్నికలకు అధికార బీజేపీ సమాయాత్తమవుతోంది. వరుసగా రెండు సార్లు అధికారం చేజిక్కించుకున్న కమలం పార్టీ.. మూడోసారి కూడా కేంద్రంలో అధికారం చేపట్టి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. ఇప్పటికే రెండు జాబితాల్లో కలిపి 267 మంది లోక్‌సభ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. అందులో 63 స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలకు టిక్కెట్లు ఇవ్వలేదు. అంటే 21 శాతం మంది సిట్టింగ్‌లను పక్కకు పెట్టేసినట్లైంది.



## అమెరికాలో టిక్‌టాక్ బ్యాన్

చైనా కంపెనీకి చెందిన ప్రముఖ వీడియో షేరింగ్ యాప్ టిక్‌టాక్ నిషేధానికి సంబంధించిన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ నిషేధ బిల్లుకు 352 మంది అనుకూలంగా ఓటు వేయగా.. 65 మంది వ్యతిరేకించారు. అధికార డెమోక్రాటిక్ పార్టీ సభ్యులతోపాటు విపక్ష రిపబ్లికన్లు కూడా ఈ బిల్లుకు మద్దతు తెలిపారు. ప్రతినిధుల సభలో ఆమోదం పొందిన ఈ బిల్లును సెనేట్‌లో ప్రవేశపెట్టనున్నారు. సెనేట్‌లో ఆమోదం తర్వాత ఈ బిల్లుపై అధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేయాల్సి ఉంటుంది. బైడెన్ సంతకం తర్వాత ఈ బిల్లు చట్టం కానుంది. కాగా, 'విదేశీ నియంత్రిత యాప్‌ల నుంచి అమెరికన్లకు రక్షణ' పేరిట తీసుకొొచ్చిన ఈ బిల్లును భారత సంతతికి చెందిన డెమోక్రాటిక్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రతినిధి మైక్ గల్లాఘే కలిసి రూపొందించారు. ఈ బిల్లు టిక్‌టాక్ నిషేధానికి సంబంధించింది కాదని డెమోక్రాటిక్ సభ్యుడు కృష్ణమూర్తి తెలిపారు. దాన్ని నియంత్రిస్తున్న బైట్‌డ్యాన్స్ గురించి అని చెప్పారు. టిక్‌టాక్ యాజమాన్యం పూర్తిగా దాని ఆధీనంలోనే ఉందన్న ఆయన.. ఆ కంపెనీ చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధీనంలో పనిచేస్తోందని వెల్లడించారు. బైట్ డాన్స్ ఎడిటర్-ఇన్-చీఫ్ సీసీపీలో అత్యున్నత హోదాలో ఉన్నారంటే పరోక్షంగా టిక్‌టాక్‌ను సీసీపీ నియంత్రిస్తోందని కృష్ణమూర్తి పేర్కొన్నారు. మరోవైపు సీసీపీ నియంత్రణలోని టిక్‌టాక్ అమెరికాలో కార్యకలాపాలు కొనసాగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మాజీ ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి మైక్ పెన్స్ అన్నారు.



## డిల్లీలో అగ్ని ప్రమాదం.. నలుగురు మృతి!

దేశరాజధాని ఢిల్లీలోని షహ్దారాలోగల శాస్త్రి నగర్ ప్రాంతంలోని ఒక భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు పిల్లలు, వారి తల్లిదండ్రులు ఊపిరాడక మరణించారు. మృతులను మనోజ్ (30), అతని భార్య సుమన్ (28), ఐదు, మూడేళ్ల వయసున్న ఇద్దరు బాలికలుగా అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు ఫైర్ సర్వీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. నాలుగు ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. సీనియర్ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ ఈ ఘటనలో నలుగురు ఊపిరాడక మృతి చెందారని తెలిపారు. నాలుగు అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం సంభవించిందని, పార్కింగ్‌లో మంటలు చెలరేగడంతో భవనం అంతటా పొగలు వ్యాపించాయన్నారు.

## 34 మందితో టీడీపీ అభ్యర్థుల రెండో జాబితా విడుదల



వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యూహాలు రచిస్తున్నారు. అందులో భాగంగా జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల బరిలో నిలపడం కోసం గెలుపు గుర్రాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే జనసేనతో కలిసి 99 మందితో ఒక అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన చంద్రబాబు.. టీడీపీ అభ్యర్థుల రెండో జాబితాను గురువారం ప్రకటించనున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు.

గురువారం టీడీపీ అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేస్తామని విలేకర్లతో చిట్ చాట్ సందర్భంగా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ జాబితాలో కొంతమంది ఎంపీ అభ్యర్థుల పేర్లు సైతం ప్రకటిస్తామన్నారు. ఎంతమందిని వీలైతే అన్ని పేర్లు ప్రకటిస్తామని చెప్పారు. ఇక బీజేపీ, జనసేనకు సంబంధించి ఎక్కడ పోటీ చేయాలనే విషయంలో ఆ రెండు పార్టీలు స్పష్టతతో ఉన్నాయని చంద్రబాబు అన్నారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో కలలకు రెక్కలు కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగానే గురువారం రెండో జాబితా విడుదల చేసే విషయాన్ని వెల్లడించారు. అలాగే సీట్లు రాని నేతలకు పార్టీ న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. పొత్తులో భాగంగా కొన్నిసార్లు సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుందని. ఈ విషయాన్ని నేతలు అర్థం చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటికే 94 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించిన టీడీపీ.. ఇబ్బందులు లేని మరో 50 స్థానాలకు గురువారం అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది. ఇక తొలి జాబితాలో గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ చౌదరి సహా పలువురు సీనియర్ నేతల పేర్లు లేవు. మరి రెండో లిస్టులో అయినా వారి పేర్లు ఉంటాయా లేదా మరికొన్నాళ్లు వేచిచూడక తప్పదా అనేది ఆసక్తికరంగా మారింది.

### టీడీపీ రెండో జాబితా లిస్ట్ ఇదే..

| నియోజకవర్గం పేరు | అభ్యర్థి పేరు |
|---|---|
| నర్సన్నపేట | రమణమూర్తి |
| మాడుగుల | ప్రసాద్ |
| గాజువాక | పల్లా శ్రీనివాస్ |
| చోడవరం | ఎస్ఎన్ఎస్ రాజు |
| ప్రత్తిపాడు | సత్యప్రభ |
| రాజమండ్రి రూరల్ | బుచ్చయ్య చౌదరి |
| దెందులూరు | ప్రభాకర్ |
| పెదకూరపాడు | ప్రవీణ్ కుమార్ |
| గిద్దలూరు | అశోక్ రెడ్డి |
| రామచంద్రాపురం | వాసంశెట్టి సుభాష్ |
| కొవ్వూరు | వెంకటేశ్వర్ రావు |
| గోపాలపురం | వెంకటరాజు |
| గుంటూరు పశ్చిమ | పిడుగురాళ్ల మాధవి |
| గుంటూరు తూర్పు | మహ్మద్ నజీర్ |
| గురజాల | శ్రీనివాసరావు |
| కందుకూరు | నాగేశ్వరరావు |
| మార్కాపురం | నారాయణ రెడ్డి |
| ఆత్మకూరు | రామనారాయణ రెడ్డి |
| కొవూరు (నెల్లూరు) | ప్రశాంతి రెడ్డి |
| వెంకటగిరి | లక్ష్మి ప్రియ |
| కమలాపురం | పుత్తా చైతన్య రెడ్డి |
| ప్రొద్దుటూరు | వరదరాజుల రెడ్డి |
| నందికొట్కూరు(ఎస్సీ) | గిత్తా జయసూర్య |
| ఎమ్మిగనూరు | జయనాగేశ్వర రెడ్డి |
| మంత్రాలయం | రాఘవేంద్ర రెడ్డి |
| పుట్టపర్తి | పల్లె సింధూరా రెడ్డి |
| కదిరి | కందికుంట యశోదా దేవి |
| మదనపల్లి | షాజహాన్ బాషా |
| పుంగనూరు | రామచంద్రారెడ్డి |
| చంద్రగిరి | వెంకటమణి ప్రసాద్ |
| శ్రీకాళహస్తి | వెంకట సుధీర్ రెడ్డి |
| సత్యవేడు | ఆదిమూలం |
| పూతలపట్టు | మురళీమోహన్ |
| గిద్దలూరు | అశోక్ రెడ్డి |



## మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌కు అస్వస్థత..

మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. జ్వరం, ఛాతీలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న పాటిల్ మహారాష్ట్రలోని పూణెలోని ఓ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. 89 ఏళ్ల మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ బుధవారం భారతి ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీనియర్ వైద్యులొకరు మీడియాతో మాట్లాడుతూ 'మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ బుధవారం రాత్రి ఆసుపత్రిలో చేరారు. ఆమె జ్వరం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. చికిత్స కొనసాగుతోంది. వైద్యులు ఆమెను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు' అని తెలిపారు. ప్రతిభా పాటిల్ భారతదేశానికి మొదటి మహిళా రాష్ట్రపతి. ఆమె 2007 నుంచి 2012 వరకు అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నారు.




## పేటీఎంకు మరో బిగ్ షాక్..!

టోల్ ప్లాజాల దగ్గర ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తకుండా మార్చి 15లోగా ఇతర బ్యాంకుల నుంచి ఫాస్టాగ్‌లు తీసుకోవాలంటూ పేటీఎం ఫాస్టాగ్ యూజర్లకు నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్ఏఐ) సూచించింది. తద్వారా జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు జరిమానాలు, డబుల్ ఫీజు చార్జీలను నివారించవచ్చని ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇతరత్రా సందేహాల నివృత్తి కోసం ఇండియన్ హైవే మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్ఎంసీఎల్) వెబ్‌సైట్‌లోని ఎఫ్ఏక్యూ సెక్షన్‌ను సందర్శించాలని తెలిపింది. నిబంధనల ఉల్లంఘనల కారణంగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై (పీపీబీఎల్) రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్చి 15 తర్వా త నుంచి పేటీఎం ఫాస్టాగ్ యూజర్లు తమ ఖా తాలను రీచార్జ్ చేసుకునే వీలుండదు. అయితే, తమ ఖాతాల్లో బ్యాలెన్స్‌ను వాడుకోవచ్చు.




## చర్చనీయాంశంగా 'పింక్ ట్యాక్స్'

ఇటీవల 'పింక్ ట్యాక్స్' చర్చనీయాంశంగా మారింది. బ్యూటీ ప్రొడక్టులకు పురుషుల కంటే మహిళలు ఎక్కువ ఖర్చు చేయడమే పింక్ ట్యాక్స్. ఉదా: ఏదైనా ఒకే రకమైన బ్యూటీ ప్రొడక్ట్ పురుషులకు రూ.80 లభిస్తే.. మహిళలకు మాత్రం రూ.100 ఉంటుంది. ఈ తేడానే పింక్ ట్యాక్స్. ఇది ఎక్కువగా సెలూన్స్, షాంపూ, సబ్బులు, దుస్తుల వంటి వాటిల్లో కనిపిస్తుంది. ఇది చట్టానికి వ్యతిరేకం కాకున్నా మహిళలపై వివక్షేనని వాదన ఉంది.

## ఘనంగా హీరో కిరణ్ అబ్బవరం ఎంగేజ్‌మెంట్



టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ ల నిశ్చితార్థం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఓ రిసార్టులో బుధవారం వీరి ఎంగేజ్‌మెంట్ గ్రాండ్‌గా జరుగగా.. ఈ వేడుకకు ఇరు కుటుంబాల సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'రాజావారు రాణిగారు' సినిమాలో వీరిద్దరూ కలిసి నటించారు. ఇక తొలి సినిమాతోనే కిరణ్, రహస్య గోరక్ ప్రేమలో పడ్డారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే మొదట్లో స్నేహితులుగా ఉన్నా.. ఆ తర్వాత వీరి స్నేహం ప్రేమగా మారింది. ఇక వీరి ఆగస్టులో పెళ్లి జరుగనున్నదని సమాచారం. మరో వైపు అభిమానులు ఈ ప్రేమజంటకు అభిమానులు, నెటిజన్లు, పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ఓ సినిమాలో నటిస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రుక్సార్ థిల్లాన్ హీరోయిన్‌గా కనిపించనున్నారట. షూటింగ్ సైతం చివరి దశకు వచ్చిందని.. ఈ చిత్రానికి దిల్ రూబా టైటిల్‌ను ఖరారు చేసినట్లు టాక్ ఈ చిత్రంపై అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది. మరోవైపు రహస్య గోరక్ రాజావారు రాణిగారు చిత్రంలో ఎంట్రీ ఇచ్చిన ఆ తర్వాత తమిళ చిత్రం 'షర్బత్'లో హీరోయిన్‌గా నటించింది. ఆ తర్వాత మరే సినిమా చేయలేదు.

## కొత్త ఫాస్టాగ్ తీసుకోండి: NHAI




నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) కీలక ప్రకటన చేసింది. పేటీఎం ఫాస్టాగ్ వినియోగిస్తున్న వారంతా వేరే బ్యాంకుల్లో కొత్త ఫాస్టాగ్ తీసుకోవాలని సూచించింది. లేకపోతే హైవేలపై వెళ్లే వాహనదారులు పెనాల్టీలు, అదనపు ఛార్జీలు భరించాల్సి ఉంటుందని పేర్కొంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ సేవలు మార్చి 15 నుంచి నిలిచిపోనున్న విషయం తెలిసిందే.



సొగసైన అందచందాలతో కుర్రకారులో సెగలు పుట్టిస్తోంది సౌందర్య శర్మ. అందాల డోస్ రెట్టింపు చేసి రచ్చ చేస్తోంది. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలో నటిస్తూ మెప్పిస్తోంది. ఫోటో షూట్‌లో అందాలన్నీ ప్రదర్శిస్తూ మైమరిపిస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.రాంఛీ డైరీస్, మిరుథియా గ్యాంగ్ స్టర్స్ సినిమాతో ఇండియావైడ్‌గా ప్రేక్షకులను అలరించింది ఢిల్లీ భామ సౌందర్య శర్మ. ఈ బ్యూటీ పొట్టి డ్రెస్‌లో హాట్ లుక్‌లో దిగిన ఫొటోలు

## సౌందర్య శర్మ హాట్ లుక్స్

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# మూడోసారి బన్నితో పూజా

గా నటిస్తున్న ఈ మూవీలో ఫహాద్ ఫాసిల్, జగపతిబాబు, అనసూయ, ప్రకాష్ రాజ్, రావు రమేష్, ధనుంజయ తదితరులు కీలక పాత్రలు చేస్తుండగా దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ ఆగష్టు 15న విడుదల కానుంది. ఇక దీని అనంతరం త్రివిక్రమ్, అట్లీ, సందీప్ రెడ్డి వంగా, బోయపాటి శ్రీను లతో అల్లు అర్జున్ మూవీస్ చేయనున్నారు. వీటిలో రెండు ఇప్పటికే అనౌన్స్ కాగా మరొకటి రెండు మూవీస్ అనౌన్స్ మెంట్స్ త్వరలో రానున్నాయి. విషయం ఏమిటంటే, వీటిలో ముందుగా కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ అట్లీ తో అల్లు అర్జున్ వర్క్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మూవీకి అనిరుద్ సంగీతం అందించనుండగా టాలీవుడ్ బ్యూటీ పూజా హెగ్డే హీరోయిన్ గా నటించనున్నారు అనేది లేటెస్ట్ టాలీవుడ్ క్రేజీ బజ్. గతంలో అల్లు అర్జున్ తో డీజే, అలవైకుంఠపురములో మూవీస్ చేసారు పూజా. మరి ప్రస్తుతం వైరల్ అవుతున్న న్యూస్ నిజం అయితే ముచ్చటగా మూడోసారి ఐకాన్ స్టార్ తో ఆమె హీరోయిన్ గా మూడవ ఛాన్స్ కొట్టినట్లే అంటున్నాయి సినీ వర్గాలు. కాగా దీని పై అఫీషియల్ గా కన్ఫర్మేషన్ అయితే రావాల్సి ఉంది.





# సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోం

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఆశ్రయం కోరి వచ్చిన వారికి భారత పౌరసత్వం కల్పించడమనేది మన సార్వభౌమ నిర్ణయమని, దానిపై రాజీపడేది లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఇందుకోసం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని ఎన్నటికీ వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేశారు. సీఏఏపై కొన్ని వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్న వేళ.. ఆయన ఓ జాతీయ మీడియా సంస్థకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. "రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ, ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లలో పీడనకు గురైన ముస్లిమేతర మైనారిటీల కోసం ఉద్దేశించినది. ముస్లింలు ఈ దేశ పౌరసత్వం కోసం దరఖాస్తు చేయకుండా ఈ చట్టం నిషేధించదు. దీని గురించి నేను చాలా వేదికలపై మాట్లాడాను. ఏ పౌరుడి హక్కులను ఈ చట్టం తొలగించదు. అందువల్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు" అని అమిత్ షా వెల్లడించారు.

**ఇది మోదీ సర్కారు తెచ్చిన చట్టం..**

సీఏఏపై ఆందోళనలు ఉద్ధృతమైతే చట్టం అమలుపై పునరాలోచనలు చేస్తారా? అన్న ప్రశ్నకు అమిత్ షా స్పందిస్తూ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. "దీన్ని ఎన్నటికీ వెనక్కి తీసుకోబోం. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని ఉపసంహరిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కానీ, వారు ఎన్నటికీ అధికారంలోకి రాలేరని ఇండియా కూటమికి కూడా తెలుసు. ఈ చట్టాన్ని మోదీ సర్కారు తీసుకొచ్చింది. దీన్ని రద్దు చేయడం అసాధ్యం. దీనిపై మేం దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తాం" అని స్పష్టం చేశారు.

**రాహుల్‌కు షా సవాల్..**

ఈ సందర్భంగా సీఏఏను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలపై హోంమంత్రి విరుచుకుపడ్డారు. "ఈ చట్టంతో భాజపా కొత్త ఓటు బ్యాంకు సృష్టించుకుంటోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వారికి ఏం పనిలేదు. వాళ్లు చెప్పింది ఎన్నడూ చేయరు. నాడు ఆర్టికల్ 370 రద్దును కూడా వారు ప్రశ్నించారు. ఇప్పుడు కూడా ఒవైసీ, రాహుల్ గాంధీ, కేజ్రీవాల్, మమతా బెనర్జీ లాంటి వాళ్లు అసత్య రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల కోసం సీఏఏను ఇప్పుడు అమలు చేయలేదు. 2019లోనే దీన్ని పార్లమెంట్‌లో ఆమోదించాం. కానీ కొవిడ్, ఇతర కారణాల వల్ల ఆలస్యమైంది. సీఏఏను ఎందుకు వద్దంటున్నారో రాహుల్ గాంధీ బహిరంగంగా చెప్పాలి. మీ వ్యాఖ్యలను రుజువు చేసుకునే బాధ్యత మీదే. ఈ చట్టాన్ని ఎందుకు తెచ్చామో మేం స్పష్టంగా చెప్పాం. ఎందుకు వ్యతిరేకిస్తున్నారో మీరూ వివరణ ఇవ్వండి" అని అమిత్ షా సవాల్ చేశారు. సీఏఏపై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలనూ కేంద్రమంత్రి దుయ్యబట్టారు. "అవినీతి బయటపడిన తర్వాత ఆయన సహనం కోల్పోయారు. వలసలపై అంత ఆందోళన ఉంటే.. బంగ్లాదేశీ చొరబాట్లు, రోహింగ్యాల గురించి ఎందుకు మాట్లాడలేదు? విభజన రోజులను ఆయన మర్చిపోయినట్లున్నారు" అని ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలోనే భాజపా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అక్రమ చొరబాట్లను అడ్డుకుంటామని అన్నారు.

**చట్టం అమలు కేంద్రం అంశం..**

సీఏఏను తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమని తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు చేసిన వ్యాఖ్యలను షా తప్పుబట్టారు. "ఇది కేంద్రానికి సంబంధించిన అంశం. రాష్ట్రాలది కాదు. ఎన్నికల తర్వాత అందరూ దీనికి సహకరిస్తే మంచిది. బుజ్జగింపు రాజకీయాల కోసం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దు" అని షా గట్టిగా చెప్పారు.



# గీతాంజలి కేసులో తొలి అరెస్ట్.. బోండా ఉమా అనుచరుడే

సోషల్ మీడియా ట్రోలింగ్‌తో బలవన్మరణానికి పాల్పడిన గీతాంజలి కేసులో తొలి అరెస్ట్ జరిగింది. పసుమర్తి రాంబాబు అనే వ్యక్తిని తెనాలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాంబాబు టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావుకు అనుచరుడిగా తెలుస్తోంది. జగనన్న పాలనలో తనకు మంచి జరిగిందంటూ ఇంటి పట్టా అందుకున్న ఆనందంలో గీతాంజలి ఓ ప్రైవేట్ ఇంటర్వ్యూలో భావోద్వేగానికి లోనైంది. అయితే ఆ వీడియోను ఉద్దేశపూర్వకంగా సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి.. ఆమెను అతిదారుణంగా ట్రోల్ చేశారు. దీంతో.. తీవ్ర మనోవేదనకు గురైన ఆమె రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే గాయాలతో ఉన్న ఆమెను ఆస్పత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన ఏపీలో తీవ్ర దుమారం రేపింది. సోషల్ మీడియాలో వేధించిన సైకోలను వదల్లొద్దంటూ డిమాండ్ బలంగా వినిపించింది. ఏపీ పోలీసులు కూడా ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసి.. పసుమర్తి రాంబాబును అరెస్ట్ చేశారు. గీతాంజలిపై రాంబాబు సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు పెట్టినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో రాంబాబును అదుపులోకి తీసుకుని తెనాలి స్టేషన్‌కు తరలించారు. మరోవైపు గీతాంజలిపై అనుచిత పోస్టులు పెట్టిన టీడీపీ, జనసేన నేతల అకౌంట్ల పరిశీలన జరుగుతోందని పోలీసులు చెబుతున్నారు. చాలామంది పోస్టులు డిలీట్ చేసినప్పటికీ.. స్క్రీన్ షాట్లను పరిశీలించాక వాళ్లపై చర్యలు ఉంటాయని.. అలాగే పరారీలో ఉన్న మరికొందరిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతున్నారు పోలీసులు.





# నష్టాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు సూచీలపై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 9:20 గంటల సమయంలో సెన్సెక్స్ 256 పాయింట్ల నష్టంతో 72,505 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 40 పాయింట్లు నష్టపోయి 21,957 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.85 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఎం అండ్ ఎం, మారుతీ, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్, టీసీఎస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, టైటన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, విప్రో, ఐటీసీ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

# ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ దూరం..!

మార్చి 22 నుంచి ఐపీఎల్ 2024 సీజన్ ప్రారంభమవుతున్న వేళ.. ఫ్రాంచైజీలకు గాయాలు, వ్యక్తిగత కారణాలతో ఆటగాళ్లు దూరం కావడం తలనొప్పిగా మారింది. తాజాగా కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చనే కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం రంజీ ట్రోఫీలో శ్రేయస్ ఆడుతున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన 95 పరుగులు చేశాడు. అయితే, మళ్లీ తన వెన్ను నొప్పి తిరగబెట్టిందని.. రంజీ ఫైనల్ ముగిసిన తర్వాత కొన్ని రోజులపాటు విశ్రాంతి తీసుకుంటాడని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. "శ్రేయస్ అయ్యర్‌కు వెన్ను నొప్పి సమస్య మళ్లీ తిరగబెట్టింది. దీంతో రంజీ ట్రోఫీ ఫైనల్ ఐదో రోజు మైదానంలోకి దిగలేదు. కొన్నాళ్లు విశ్రాంతి తీసుకుని క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతాడు. దీంతో ఐపీఎల్ 2024 సీజన్‌లో ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశాలు మెండుగానే ఉన్నాయి" అని క్రీడా వర్గాలు తెలిపాయి. గతేడాది ఇదే సమస్యతో శస్త్రచికిత్స చేయించుకుని వన్డే వరల్డ్ కప్ నాటికి వచ్చాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ మధ్యలో మరోసారి వెన్ను నొప్పి ఇబ్బంది పెట్టింది. కాస్త కోలుకోవడంతో రంజీ ఫైనల్‌లో ఆడుతున్నాడు. ఒకవేళ శ్రేయస్ అందుబాటులో లేకపోతే కోల్‌కతా యాజమాన్యం మళ్లీ నితీశ్ రాణాకు సారథ్య బాధ్యతలు అప్పగిస్తుందా? కొత్తగా ఎవరినైనా కెప్టెన్ చేస్తుందో చూడాలి. ఈ సీజన్‌లో కోల్‌కతా తొలి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మార్చి 23న తలపడనుంది. మార్చి 29న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఏప్రిల్ 3న దిల్లీ క్యాపిటల్స్‌తో కేకేఆర్ ఆడనుంది.






# షేక్ షాజహాన్‌పై భూ ఆక్రమణ కేసు.. సందేశ్‌ఖాలీలో ఈడీ సోదాలు

పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహిస్తున్నది. భూ ఆక్రమణ కేసుతో టీఎంసీ బహిష్కృత నేత, సందేశ్‌ఖాలీ ఘటన నిందితుడు షేక్ షాజహాన్ ప్రమేయంపై ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి షాజహాన్‌కు చెందిన ఇటుక బట్టీతోపాటు ధమఖలీ అనే ప్రాంతంలో సోదాలు చేస్తున్నారు. గతంలో తనిఖీలకు వెళ్లిన బృందాలపై దాడులు జరిగిననేపథ్యంలో సందేశ్‌ఖాలీలో భారీ సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు. మహిళా బలగాలను కూడా రంగంలోకి దింపారు. రేషన్ పంపిణీ కుంభకోనాన్ని విచారించేందుకు వెళ్లిన సందర్భంలో ఈడీ అధికారులపై గత నెల 5న షేక్ షాజహాన్, అతని అనుచరులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అక్కడి మహిళలను టార్గెట్ చేస్తూ టీఎంసీ గుండాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీంతో అక్కడి మహిళలు షేక్ షాజహాన్, ఇతర టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా సందేశ్‌ఖాలీ పేరు మారుమోగింది. ఈ ఘటనల తర్వాత షేక్ షాజహాన్ 55 రోజుల పాటు పరారీలో ఉన్నాడు. సీబీఐ, ఈడీ లేదా పోలీసులు అతన్ని అరెస్టు చేయవచ్చని కలకత్తా హైకోర్టు ఆదేశించిన ఒక రోజు తర్వాత బెంగాల్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. కాగా, ఈడీ బృందంపై దాడికేసులో షాజహాన్ సోదరుడు షేక్ ఆలంగిర్‌కు సీబీఐ నోటీసులు జారీ చేసింది. అతనితోపాటు మరో ఏడుగిరి కూడా తాఖీదులు ఇచ్చింది. కోల్‌కతాలోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది.

# మద్యం మత్తులో డ్రైవర్.. మార్కెట్లోకి దూసుకెళ్లిన ట్యాక్సీ.. మహిళ మృతి, 15 మందికి గాయాలు

దేశ రాధాని ఢిల్లీలోని ఘాజీపూర్‌లో పెను ప్రమాదం తప్పింది. మద్యం మత్తులో ఉన్న ఓ టాక్సీ డ్రైవర్ తన కారుతో రద్దీగా ఉండే మార్కెట్లోకి దూసుకెళ్లాడు. దీంతో 22 ఏండ్ల మహిళ మరణించగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు ట్యాక్సీ డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. మృతురాలిని ఘజియాబాద్‌కు చెందిన సీతా దేవిగా గుర్తించారు. క్షతగాత్రులను సమీపంలోని లాల్ బహదూర్ శాస్త్రి దవాఖానకు తరలించారు. ట్యాక్సీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదం జరిగినప్పుడు మార్కెట్ అంతా జనంతో నిండిపోయిందని, ఆ క్రమంలో కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటన అక్కడున్న ఓ సీసీటీవీలో రికార్డయింది. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

